ప్రజాశక్తి
బుధవారం 10 ఏప్రిల్ 2024
5
శ్రీకాకుళం

30 నుంచి కూచిపూడి శిక్షణ

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం రూరల్ మండలం కల్లేపల్లిలోని సంప్రదాయం కూచిపూడి గురుకులంలో ఈనెల 30 నుంచి కూచిపూడి నృత్యంలో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గురుకులం డైరెక్టర్ స్వాతి సోమనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ పదో తేదీ వరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దూర ప్రాంత విద్యార్థినీ విద్యార్థులకు భోజన, వసతి సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలతో పాటు సంప్రదాయం కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 9440681083 ఫోన్ నంబరును గానీ sam-pradaayam2019@gmail.com ఈ-మెయిల్ చేయాలని సూచించారు.

ఓట్ల వేట మొదలు

- మండుటెండను లెక్క చేయని అభ్యర్థులు
- ఎసి గదులు, వాహనాలు వదిలి జనంలోకి
- రంగంలోకి కుటుంబసభ్యులు
- హోరెత్తుతున్న ప్రచారం

జిల్లాలో రాజకీయం వేడెక్కింది. ప్రధాన పార్టీలన్నీ తమ అభ్యర్థులను ఖరారు చేయడంతో ప్రచారం జోరందుకుంది. మరో ఎనిమిది రోజుల్లో నోటిఫికేషన్ వెలువడనుండడంతో అంతా జనం బాట పడుతున్నారు. ఎసి గదుల నుంచి బయటకు వస్తున్నారు. పదవిలో ఉన్నా, లేకున్నా ఎసి వాహనాల్లో తిరిగే ప్రధాన పార్టీల అభ్యర్థులు వాటిని వదిలి కార్యకర్తలతో కలిసి నడుస్తున్నారు. మండుటెండలో చెమటలు కక్కుతూ ప్రచారం చేస్తున్నారు. రోడ్ షోలు నిర్వహిస్తూ ఓటర్లకు అభివాదం చేస్తున్నారు. అభ్యర్థుల తరుపున వారి కుటుంబ సభ్యులు గ్రామాల్లో ప్రచారం సాగిస్తున్నారు. పార్టీల్లో చేరిన వారికి కండువాలు కప్పుతూ, ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రధానంగా వైసిపి, టిడిపి మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ రెండు పార్టీల అభ్యర్థులు పిరియా విజయ, బెందాళం అశోక్ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రచారం సాగిస్తున్నారు. ప్రచారానికి వెళ్లే ముందు పార్టీలో చేర్చుకునే పనిచేస్తున్నారు. పలాస నియోజకవర్గంలో పశు సంవర్ధక శాఖ మంత్రి, వైసిపి అభ్యర్థి సీదిరి అప్పలరాజు, టిడిపి అభ్యర్థి గౌతు శిరీష పోటాపోటీగా ప్రచారం సాగిస్తున్నారు. మంత్రి అప్పలరాజు ఉదయం పది గంటలకు వెళ్లి సాయంత్రం వరకు గ్రామాలను సందర్శిస్తున్నారు. గౌతు శిరీష ఉదయం ఏడు గంటలకే గ్రామాల్లోకి వెళ్లి ప్రచారం పూర్తి చేసి మధ్యాహ్నానికి వస్తున్నారు. మళ్లీ సాయంత్రం పూట రెండో విడత ప్రచారానికి వెళ్తున్నారు. టెక్కలి నియోజకవర్గంలో టిడిపి సిట్టింగ్ ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మధ్య పోటీ నెలకొంది. ఎమ్మెల్సీ దువ్వాడ ఉదయం ఎనిమిది గంటలకే ప్రచారం మొదలు పెడుతున్నారు. ఇంటింటికీ వెళ్తున్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి మరణించడంతో కొద్దిరోజులు ప్రచారానికి దూరంగా ఉన్నారు. నియోజకవర్గంలో అతని తరుపున ఎంపీ రామ్మోహన్‌నాయుడు, టిడిపి ముఖ్య నాయకులు ప్రచారంలో పాల్గొంటున్నారు. నరసన్నపేటలో టిడిపి అభ్యర్థి బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రతిరోజూ ఉదయం ఏడు గంటలకే ప్రచారం మొదలు పెడుతున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఇళ్లకు చేరుకుని సాయంత్రం ఐదు గంటల సమయంలో రెండో విడత ప్రచారం సాగిస్తున్నారు.

ఎండ బారిన పడకుండా జాగ్రత్తలు

ఎండ బారిన పడకుండా అభ్యర్థులు ఉదయాన్నే ప్రచారం ప్రారంభించి, తర్వాత సాయంత్రం వేళల్లో ప్రచారం సాగిస్తున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. పార్టీలోని అసమ్మతి నాయకులను కలిసి మద్దతు కోరుతున్నారు. టిడిపి అభ్యర్థి మామిడి గోవిందరావు ఇప్పుడిప్పుడే ప్రచారం మొదలు పెట్టారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఉదయం ఏడు గంటల సమయంలో గ్రామాల్లో, సాయంత్రం సమయంలో శ్రీకాకుళం నగరంలో ప్రచారం చేస్తున్నారు. టిడిపి అభ్యర్థి గొండు శంకర్ ఉదయం ఆరు గంటలకు ప్రచారం మొదలు పెట్టి గ్రామాల్లో తిరుగుతున్నారు. అసమ్మతి నాయకులనూ కలుస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామాల్లోకి వెళ్లి విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. ఎన్‌డిఎ కూటమి తరుపున పోటీ చేస్తున్న ఎన్.ఈశ్వరరావు గ్రామాల్లో ప్రచారం చేస్తూనే మూడు పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో శాసనసభాపతి తమ్మినేని సీతారాం ఉదయం తొమ్మిది గంటలు, సాయంత్రం ఆరు గంటల సమయంలో ప్రచారం సాగిస్తున్నారు. టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ ఉదయం తొమ్మిది గంటలకే ప్రచారం మొదలు పెట్టి మధ్యలో గంట విరామిచ్చి రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రచారం సాగిస్తున్నారు.

ఎమ్మెల్యే అశోక్ తరుపున ప్రచారం చేస్తున్న సతీమణి నీలోత్పల

రంగంలోకి కుటుంబసభ్యులు

ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు కుటుంబ సభ్యులు ప్రచారం రంగంలోకి దిగారు. ఇచ్ఛాపురంలో టిడిపి అభ్యర్థి బెందాళం అశోక్‌కు తోడుగా అతని భార్య నీలోత్పల కవిటి మండలంలో ఇంటింటికీ ప్రచారం మొదలు పెట్టారు. పలాస నియోజకవర్గంలో పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు సతీమణి శ్రీదేవి వజ్రపుకొత్తూరు మండలంలో ఈ నెల ఆరో తేదీన ప్రారంభమైన ప్రచార యాత్రలో పాల్గొన్నారు. నరసన్నపేటలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తరుపున అతని భార్య పద్మప్రియ, కుమారులు కృష్ణచైతన్య, రామలింగం నాయుడు ప్రచారంలో పాల్గొంటున్నారు. టిడిపి అభ్యర్థి బగ్గు రమణమూర్తికి మద్దతుగా అతని కుమార్తె అర్చన గ్రామాల్లో ప్రచారం సాగిస్తున్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తరుపున అతని భార్య గజలక్ష్మి, కుమారుడు రామ్ మనోహర్ నాయుడు ప్రచారం చేస్తున్నారు. టిడిపి అభ్యర్థి గొండు శంకర్ తరుపున అతని భార్య స్వాతి, తండ్రి జగపతి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తరుపున సతీమణి పరిమళ ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతికి సాయంగా కుమారుడు ఓంశ్రీకృష్ణ గ్రామాల్లో తిరుగుతున్నారు.

ప్రచారం చేస్తున్న మంత్రి ధర్మాన సతీమణి గజలక్ష్మి

ఎన్ని'కల' పంచాంగం

- పంచాంగ శ్రవణంపై ఆసక్తి
- పండితుల నోట విజయీభవ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

'కాలం కలిసి వస్తుంది... ఈ ఎన్నికల్లో విజయం మిమ్మల్నే వరిస్తుంది'. ఇది ఎన్నికల వేళ పండితుల నోట అభ్యర్థులకు వినిపించే మాట. ఉగాది పర్వదినాన పంచాంగానికి ఉన్న ప్రాముఖ్యతను పరిగణలోకి తీసుకుని రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు పంచాంగ శ్రవణంపై ఆసక్తి చూపించారు. ఉగాది నాడు సాగిన పంచాంగ శ్రవణం అభ్యర్థుల ఇంట ఆసక్తిని రేపింది. పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థికీ విజయం సొంతమవుతుందని గణాంకాలు వేసి పండితులు చెప్పిన మాటలు ఆసక్తి రేపాయి. ఓట్లు వేసే ఓటర్లపై నమ్మకం అటుంచితే, పండితులు పంచాంగ పఠనం చేసిన అభ్యర్థులదే విజయం వరిస్తుందని చెప్పడం అభ్యర్థుల్లో ఆసక్తి నెలకొంది.

ఈసారి ఎన్నికల సమయం కావడంతో పండితులు ఎవరికి వారుగా తమకు నచ్చిన రీతిలో అభ్యర్థులనూ, రాజకీయ పార్టీలనూ మెప్పించేందుకు పంచాంగ శ్రవణాన్ని అనువుగా మార్చుకున్నారు. వైసిపి కార్యాలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో వైసిపి అభ్యర్థి, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఆయన అనుచరులు హాజరై పంచాంగ శ్రవణాన్ని ఆలకించారు. తమ భవిష్యత్ నిర్ణయాన్ని పంచాంగంలో ఎలా ఉందనేది అడిగి మరీ తెలుసుకున్నారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ విశాఖ-ఎ కాలనీలోని తన కార్యాలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణం చేయించారు. పండితులు చెప్పిన రాజయోగం, అందరికీ కలిసి వచ్చే కాలమే అని చెప్పినా... ఓటర్ల తీర్పుతోనే ఇది సాధ్యమవుతుందని అభ్యర్థులు సరిపెట్టుకున్నారు.

పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన నగదు

రూ.6.75 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - రణస్థలం

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని పైడిభీమవరం వద్ద తనిఖీల్లో రూ.6.75 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన కాంట్రాక్టరు సతీష్ రెడ్డి అనపర్తి నుంచి కోటబొమ్మాళికి కారులో వెళ్తున్నారు. ఆ కారును పోలీసులు తనిఖీ చేయగా రూ.6.75 లక్షల నగదు ఉంది. ఇందుకు సంబంధించిన ఎటువంటి రశీదులు, ఆధారాలు చూపకపోవడంతో ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జె.ఆర్ పురం ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జీడి.. ఆశలు ఇక వాడి

- పలుచోట్ల నేటికీ రాని పూత
- ఆందోళనలో రైతులు

ఉగాది వచ్చిందంటే షడ్రుచుల సమ్మేళనంతో పాటు జీడి రైతుకు అదో ఆనందాల పండగ. ప్రతి ఏటా ఉగాదికి తమ తోటలోని జీడిపిక్కలు, పళ్లు తెచ్చి వాటిని నైవేద్యంగా పెట్టడం జీడి రైతుల సంప్రదాయం. ఈ ఏడాది వారి సంప్రదాయానికి బ్రేక్ పడింది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో జీడి చెట్లు పూత దశకు కూడా చేరుకోకపోవడం, కొన్ని ప్రాంతాల్లో పూత వచ్చినా పిక్కలు రాకపోవడం ఇందుకు కారణం. ఏప్రిల్ రెండో వారం గడుస్తున్నా ఇంకా పంట రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూతరాని జీడిచెట్లు

వాడిపోయిన జీడిపువ్వు

ప్రజాశక్తి - కవిటి

జిల్లావ్యాప్తంగా 46,743.63 ఎకరాల్లో జీడిపంట సాగవుతోంది. అందులో ఒక్క పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోనే సుమారు 24,753 ఎకరాల్లో జీడి పంటను సాగు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 15 వేల టన్నుల జీడి పిక్కలు దిగుబడి వస్తుండగా, సుమారు 13వేల మందికి ఈ పంట ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు, కొన్ని తెగుళ్ల వల్ల జీడిపంటకు భారీ నష్టం వాటిల్లింది. జిల్లాలో సగానికి పైగా ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా చెట్లు పూత దశకు కూడా చేరుకోలేదు. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి చాలా ప్రాంతాల్లో మార్చి మూడో వారం నుంచే జీడిపంట ప్రారంభమవుతుంది. ఏప్రిల్ రెండో వారం నడుస్తున్నా ఇంకా పంట ప్రారంభం కాకపోవడం గమనార్హం. గతేడాది ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఈ ఏడాది జీడి పంటపై ప్రభావాన్ని చూపిస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో చిగురు, పూత రాకపోవడానికి సరైన నీటి సదుపాయం లేకపోవడమే కారణం. గతేడాది పంట దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర లేదు. ఈ ఏడాది పంట రావడమే కష్టంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో తమ జీవనాధారంపై జీడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సగం పంట రావడం కష్టమే

మాది ఉమ్మడి కుటుంబం. గతేడాది మాకు సుమారు 40 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది దాంట్లో సగం రావడం కూడా కష్టమే. చాలా చెట్లు పూత కూడా లేదు. ఇప్పటికే సమయం దాటిపోయింది.

- బొర్ర రంగనాథం, రైతు, చండిపుట్టుగ

ఆశగా ఎదురుచూస్తాం

మా ప్రాంతంలో జీడి అంతర పంటగా సాగు చేస్తాం. ఈ పంటపై వచ్చే ఆదాయం కుటుంబంలో ఏదో ఒక అవసరాన్ని తీరుస్తుంది. ఈ ఏడాది మాత్రం అలా కనిపించడం లేదు. 30 శాతం పంట రావడం కష్టం.

- బల్లెడ మోహనరావు, జీడి రైతు, బైరిపురం

ఈ-క్రాప్ చేశాం

ఈ సమయానికే పంట ప్రారంభం కావాల్సి ఉన్నా, ఆ పరిస్థితి కనిపించడం లేదు. అక్కడక్కడా టీ దోమ ప్రభావం, కొన్ని ప్రాంతాల్లో పొటాషియం లోపం కనిపిస్తోంది. పొటాషియం లోపం ఉన్నప్పుడు పిక్క వచ్చినా దానిపై నలుపు మచ్చలు, జిగురు వంటివి కనిపించి పిక్క ఎదుగుదల ఉండదు. అలా ఉంటే మల్టీ కె అనే ద్రావణాన్ని లీటరు నీటికి పది గ్రాముల చొప్పున కలుపుకొని పిచికారీ చేయాలి. నాలుగు మండలాల్లో జీడి పంటకు ఈ-క్రాప్ చేశాం.

- పి.మాధవీలత, ఉద్యానశాఖ అధికారి, కవిటి

టిడిపిని నమ్మే స్థితిలో లేరు

24న నామినేషన్ : రెవెన్యూ మంత్రి ధర్మాన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని వైసిపి కార్యాలయంలో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ధర్మపురి గౌరీ శంకరశాస్త్రి పంచాంగ పఠనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి సమావేశాలు, సభలకు జనాల్లేక వెలవెలబోతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తర్వాత అమలు చేయరని ప్రజలు గ్రహించారని చెప్పారు. వైసిపి సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు క్షేత్రస్థాయిలో కార్యకర్తలు మరింత బాగా పనిచేయాలని సూచించారు. డివిజన్ ఇన్‌ఛార్జిలు తమ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం సాగించాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలో ఉన్నవాళ్లందరూ సోషల్ వర్కర్స్ అని తెలిపారు. ఎన్నికలకు మరో నెల రోజులు సమయం ఉందని, పార్టీ కార్యకర్తలంతా ఏకతాటిపై నడిచి, ఇప్పటిదాకా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. విద్యావంతుల సంఖ్య ప్రతి ఐదేళ్లకూ పెరుగుతోందన్నారు. అందుబాటులోకి వచ్చిన మాధ్యమాలను, సాంకేతికతను వినియోగించుకుని పార్టీ చేపట్టిన కార్యక్రమాలపై డిజిటల్ ప్రచారం విస్తృత రీతిన సాగించాలని సూచించారు. ఈనెల 24వ తేదీన తాను నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఈలోగా డివిజన్ల పరిధిలో అన్ని ఇళ్లకూ నాయకులు వెళ్లాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మంచి మెజార్టీతో శ్రీకాకుళం నియోజకవర్గంలో గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.

మమ్మల్ని మినహాయించండి

- ఎన్నికల విధుల నుంచి తప్పించాలని విజ్ఞప్తులు
- అనారోగ్య, ఇతర కారణాలతో సుమారు 200 దరఖాస్తులు
- కలెక్టరేట్‌కు క్యూ కడుతున్న కొందరు ఉద్యోగులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో కొందరు ఉద్యోగుల్లో టెన్షన్ మొదలైంది. ఎన్నికల విధులకు నియమితులైన వారిలో పలువురు పలు కారణాలను చూపుతూ విధుల నుంచి మినహాయింపు కోసం కలెక్టరేట్‌లో దరఖాస్తులు ఇస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల మానవ వనరుల విభాగ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావును కలిసి దరఖాస్తులు అందజేస్తున్నారు. శిక్షణ కోసం ఇప్పటికే శాఖల వారీగా వర్తమానం వస్తుండడంతో రెండు రోజులుగా వీరి తాకిడి ఎక్కువగా ఉంది. అనారోగ్య కారణాలు, పదవీ విరమణ అంశాలను ప్రధానంగా చూపుతున్నారు. ఇప్పటివరకు మినహాయింపు కోరుతూ సుమారు 200 మంది వరకు దరఖాస్తులు అందజేశారు. తప్పనిసరి పరిస్థితి ఎదురైతే తప్ప ఎన్నికల విధులకు నియమితులైన ఎవరికీ మినహాయింపులు ఇవ్వకూడదని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. మినహాయింపులు ఇస్తే సిబ్బంది సరిపోక ఇబ్బందులు వస్తాయని భావిస్తున్నారు. దీంతో అనారోగ్య కారణాలపై వచ్చిన దరఖాస్తులను వడపోసేందుకు మెడికల్ బోర్డుకు పంపించనున్నారు.

సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి ఉపాధ్యాయులను తప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి ప్రయత్నమే చేసింది. వీరిని కాదని సచివాలయ ఉద్యోగులతో ఎన్నికలు నిర్వహించడం వల్ల మేలు చేకూరుతుందని భావించి, ఆ దిశగా ప్రయత్నాలు చేసింది. ఎన్నికల సంఘం అందుకు భిన్నంగా ఎప్పట్లాగే ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులను నియమించాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో ప్రభుత్వ శాఖల వారీగా ఉద్యోగులతో పాటు ఉపాధ్యాయుల వివరాలను సేకరించి, వారిని విధులకు పంపించేందుకు అవసరమైన శిక్షణను ప్రారంభించారు. ఎన్నికల విధులకు హాజరు కావాల్సిన కొందరు ఉద్యోగులు వాటి నుంచి మినహాయింపు కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారు.

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అవసరమైనంత మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు లేరు. అంగన్వాడీలను సైతం సైతం గత ఎన్నికల్లో పోలింగ్ విధులకు వినియోగించారు. ఈసారి కొత్తగా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సేవలను ఎన్నికల కోసం జిల్లా యంత్రాంగం వినియోగించుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి సూచనలు వచ్చాయి. దీంతో పోస్టల్, బిఎస్‌ఎన్‌ఎల్, రైల్వే, ఆదాయపు పన్ను శాఖ, ఇఎస్ఐ వంటి సంస్థల ఉద్యోగుల వివరాలను సేకరిస్తున్నారు. పిఒ, ఎపిఒ, ఒపిఒలుగా నియమితులైన వారికి ఇటీవల నియామకపత్రాలు ఇచ్చారు. వీరికి ఈనెల 10, 12 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ తరుణంలో మినహాయింపుల విషయంలో ఉన్నతాధికారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. మే నెలాఖరున ఉద్యోగ విరమణ చేసే వారికి మాత్రం మినహాయింపు తప్పనిసరి. ఆపై మెడికల్ బోర్డు అనుమతిస్తే అనారోగ్య కారణాల దరఖాస్తుదారులకు మినహాయింపు లభించనుంది.

బంగారం దుకాణాలు కళకళ

ఉగాది రోజున పసిడి కొనుగోలుకు ఆసక్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం నగరంతో పాటు నరసన్నపేట, పలాస, ఇతర ప్రాంతాల్లో బంగారం దుకాణాలు కళకళలాడాయి. పసిడి ధరలు పరుగులు పెడుతున్నా ఏమాత్రం వెనుకాడకుండా బంగారం, ఆభరణాలు, వెండి వస్తువులు కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపారు. తెలుగు వారు చేసుకునే తొలి పండుగ ఉగాది. ఉగాది రోజున కొత్త వస్తువులు కొనుగోలు చేసి ఇంటికి తెచ్చుకుంటే ఏడాది పొడవునా అదే తరహాలో కొనుగోలు చేస్తుంటారని ఒక నమ్మకం. అందువల్లే బంగారు, వెండి ఆభరణాలపై ఆసక్తి చూపుతారు. బంగారం, వెండితో పాటు నూతన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. కొందరు పసుపు, బెల్లం, చింతపండు, ఉప్పు వంటి నిత్యావసర సరుకులను కొనుగోలు చేస్తారు. మరికొందరు బంగారు, వెండి కొనుగోలు చేసేందుకు దుకాణాలకు వెళ్లడంతో మంగళవారం కిటకిటలాడాయి. ఇటీవలి కాలంలో బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, అందువల్ల ఆశించిన స్థాయిలో కొనుగోలుకు అవకాశం లేకుండా పోతోందని పలువురు మహిళలు వాపోయారు. నగరంలో ఇటీవల వస్త్ర దుకాణాలకు ధీటుగా బంగారు, వెండి దుకాణాలకు తరలివచ్చారు. దీంతో బంగారు, వెండి వ్యాపార కేంద్రంగా నగరం విస్తరించింది. నచ్చిన మోడల్, అనుకున్నంత ధరలో కొనుగోలుకు అవకాశం చిక్కిందని గతంలో బంగారు నగలు కొనుగోలు చేయాలంటే విశాఖ నగరానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు స్థానిక వ్యాపారుల భాగస్వామ్యంతో పెద్ద సంస్థలు తమ దుకాణాలను తెరిచి వ్యాపారాలు చేసుకుంటున్నారు. పండగ పూట దుకాణాల్లో సందడిగా కనిపించాయి.

బంగారం దుకాణంలో కొనుగోలు చేస్తున్న మహిళలు

కంకర వేసి నిరసన తెలుపుతున్న రైతులు

ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లాం సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వే నంబరు 81/1పిలో మూడు ఎకరాల కంకర భూములను కొందరు ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొర్లాం గ్రామ సచివాలయం ముందు రైతులు కంకరను వేసి మంగళవారం రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు పి.సోమేష్, కె.జగదీష్, ఎస్.రామస్వామి, పి.చందు, వి.మోహనరావు, బి.విశ్వనాథం మాట్లాడుతూ ఆక్రమణలు గురైన కంకర భూముల్లో ఉన్న నీటితో తమ పంట భూములను సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఈ భూములను ఆక్రమించిన కొంతమంది శాశ్వత భవనాల నిర్మాణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వీటి నిర్మాణాన్ని వ్యతిరేకించాలని సచివాలయం ముందు కంకర పోసినట్లు తెలిపారు. సంఘటనపై స్థానిక అధికారులకు సంప్రదించగా వీఆర్‌ఒ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎంపిడిఒ రామారావును వివరణ కోరగా, సంఘటనపై ఎటువంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు.

కోటేశ్వరస్వామికి వెండి కవచం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఉమారుద్రకోటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పానవట్టం వెండి తొడుగును దాతలు బహూకరించారు. ఉగాది వేడుకల్లో భాగంగా మంగళవారం పానవట్టాన్ని స్వామివారికి అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి శర్మ పాల్గొని విశేష సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ సుంకరి కృష్ణ, ప్రత్యేక ఆహ్వానితులు ఉరిటి శ్రీనివాస్, గురుగుబెల్లి నాగరాజు దంపతులు, సభ్యులు నక్క రామరాజు, అర్జునరెడ్డి, పూసర్ల సతీష్, అంధవరపు బాలమని రామలింగం, ఆలయ ఇఒ ఎ.సుకన్య, జూనియర్ సహాయకులు నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

రాజీనామా పత్రాలను అందిస్తున్న వాలంటీర్లు

వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని అక్కుపల్లి సచివాలయం పరిధిలోని బైపల్లి పంచాయతీకి చెందిన ఆరుగురు వాలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు వాలంటీర్లు తామాడ జ్యోత్స్న, రెయ్యి శ్రీకృష్ణ, దున్న ప్రభాస్, దుమ్మి వినేష్, తమాడ మీనా, మద్దు ప్రణవి తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి లండ రాజేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ కరోనా కష్టకాలం నుంచి పింఛన్ల పంపిణీ వరకు ప్రజల్లో నాలుకగా ఉండే తమపై టిడిపి రాజకీయ కక్షతో తమపై అభాండాలు వేస్తూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో మనస్తాపానికి గురైనట్లు తెలిపారు.

వైసిపితోనే సంక్షేమం, అభివృద్ధి

మందస : ప్రచారం చేస్తున్న మంత్రి అప్పలరాజు

మందస : పలాస నియోజకవర్గంలో గౌతు కుటుంబం కొన్ని ఏళ్ల నుంచి పరిపాలన చేసి ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. మందస మండలం తాళ్లగురంటి, బుడారిసింగి, భోగాపురం, సిరిపురం పంచాయతీల్లో మంగళవారం మంత్రి ఇంటింటికీ వెళ్లి ఎన్ని ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం చిన్నకోష్టలో పది కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఈ ఐదేళ్లలో రూ.700 కోట్ల వ్యయంతో ఇంటింటికీ తాగునీరు, రూ.50 కోట్లు వ్యయంతో 200 పడకల ఆస్పత్రి, కిడ్నీ పరిశోధన కేంద్రం నిర్మాణం చేపట్టి ప్రజలకు అంకితం చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కారి దానయ్య, హనుమంతు వెంకటరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ప్రతి పేదవాడి ఇంటికీ ప్రభుత్వ పథకం అందించిన ప్రభుత్వం వైసిపి అని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని మారడికోట పంచాయతీ పాతర్లలోవలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి నాకు గెలిపించాలని కోరారు. అంతకుముందు ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎండయ్య, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, పిఎసిఎస్ అధ్యక్షులు బాలరాజు, సర్పంచ్ పెద్దింటి భాగ్యం, శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయకుమార్, ఎఎంసి వైస్ మాజీ చైర్మన్ ఎ.రాజశేఖరరెడ్డి, బాలకృష్ణ, ప్రకాష్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

మెళియాపుట్టి : ప్రచారం చేస్తున్న రెడ్డి శాంతి

టెక్కలి రూరల్ : సంక్షేమ పథకాలు వైసిపిని గెలిపిస్తాయని ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. టెక్కలి పంచాయతీ పెద్ద చేరి వీధి, చిన్న చేరి వీధి, సోగ్గాడుపేటలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండేల సుజాత, ఎంపిటిసిలు కూన పార్వతి, పీత హేమలత, చింతాడ గణపతి, వైస్ ఎంపిపి సభ్యులు మన్నేల కిషోర్, టెక్కలి టౌన్ అధ్యక్షులు తమ్మన్నగారి కిరణ్, మండల పార్టీ అధ్యక్షులు కిల్లి.అజయ్, టెక్కలి మండలం జెసిఎస్ కన్వీనర్ శిగిలిపల్లి. మోహన్, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, దవళ కృష్ణారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న గొండు శంకర్

'సూపర్ సిక్స్'పై ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ ఎన్నికల వేళ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై శ్రీకాకుళం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి గొండు శంకర్ గార మండలం శ్రీకూర్మాం పంచాయతీ పరిధిలోని అయ్యవారిపేట, శ్రీకాకుళం నగరంలోని హయాతీనగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు టిడిపి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్డి శంకర్, పాడ్రంకి శంకర్, గొండు వెంకటరమణమూర్తి, పీస రమణమూర్తి, కొంక్యాన ఆదినారాయణ పాల్గొన్నారు. అంతకుముందు శ్రీకాకుళం నగరంలోని విశాఖ ఎ కాలనీలో ఉన్న నియోజకవర్గ కార్యాలయంలో ఉగాది వేడుకలను నిర్వహించారు.

నందిగాం : మండలంలోని కవిటి అగ్రహారంలో టిడిపి మండల నాయకులు పినకాన అజయ్ కుమార్, మల్ల బాలకృష్ణ, కె.తాతయ్య, బండారు శివ, బర్ల కృష్ణమ్మ, జనసేన నాయకులు తాడేల చిరంజీవిలు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం కంబాలరాయుడుపేట పంచాయతీలో ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషకు మద్దతుగా నాయకులు పుచ్చ ఈశ్వరరావు, బిసిసెల్ ప్రధాన కార్యదర్శి గోవిందు పాపారావు, కర్ని రమణ, కంబాల దానేషు, మాజీ ఎంపిపి మద్దిల చిన్నయ్య, అఖిల్, చింత నారాయణలు ప్రచారం చేశారు.

శ్రీకాకుళం రూరల్ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ప్రసాదరావు

వైసిపిలో పలువురు చేరిక

పోలాకి : మండలంలోని డి.ఎల్.పురం పంచాయతీ నుంచి టిడిపి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన బమ్మిడి రాజుతో పాటు 50 టిడిపి సానుభూతిపరులు వైసిపిలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ వైసిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న అభివృద్ధి, సంక్షేమ పాలనకు మద్దతుగా నిలిచిన వారందరికీ ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిసి సెల్ జోనల్ రాష్ట్ర ఇన్‌ఛార్జి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ భైరాగినాయుడు, ఎఎంసి చైర్మన్ దుంపల భాస్కరరావు, పార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, వైస్ ఎంపిపి కోట అప్పారావు, కలగదండు తాతారావు, జెసిఎస్ కన్వీనర్ కణితి సత్తిబాబు, యువజన విభాగం అధ్యక్షుడు రెంటి కోట త్రినాథరావు, చింతు రాఘవరావు, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు కల్లేపల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని శ్రీకూర్మం పంచాయతీ, నగరాలపేటకు చెందిన 50 మంది యువకులు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైసిపిలో చేరారు. మంత్రి ధర్మాన నివాసంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం పంచాయతీ మామిడివలసకు ఎంపిటిసి బగ్గు అప్పారావు ఆధ్వర్యాన యువకులు చేశారు.

వీల్‌చైర్ వితరణ

ప్రజాశక్తి- కవిటి, సోంపేట

మండలంలోని బొరివంకకు చెందిన హెల్పింగ్ హేండ్స్ సంస్థ మరోసారి తన ఔదార్యం చాటుకుంది. సోంపేట మండలం బెంకిలికి చెందిన భైరి రాజేష్ పైరాలసిస్‌తో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తమకు అండగా నిలవాలని హెల్పింగ్ హేండ్స్ సంస్థను ఆశ్రయించాడు. దీంతో కవిటి మండలం బి.జి.పుట్టుగకు చెందిన పత్రి షణ్ముఖరావు తన స్నేహితుడి జి.ఖగేష్ జ్ఞాపకార్థం రాజేష్‌కు వీల్‌చైర్ అందించేందుకు ముందుకు వచ్చారు. దీంతో సంస్థ సభ్యులతో కలిసి మంగళవారం రాజేష్‌కు వీల్‌చైర్ అందించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హేండ్స్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

వీల్‌చైర్‌తో రాజేష్

అవార్డు అందుకుంటున్న సభ్యులు

'మనబడి'కి ఉగాది పురస్కారం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ఉగాది సందర్భంగా శ్రీకాకుళంలోని అరసవల్లిలో మనీపాత్రుని క్రియేటివ్ అకాడమీ సభ్యులు ఉదయ భాస్కర్ ఉగాది పురస్కారాలు మంగళవారం అందజేశారు. సేవా రంగంలో సంతబొమ్మాళి మండలానికి చెందిన మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ వల్లేవలసకు ఉగాది పురస్కారం లభించింది. ఈ మేరకు సంఘ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు ప్రదాత, రాష్ట్రపతి అవార్డు గ్రహీత మనీపాత్రుని నాగేశ్వరరావు మాట్లాడుతూ మనబడి అసోసియేషన్ కొన్నేళ్లుగా మండలంలో సేవలు అందిస్తూ ఎన్నో కుటుంబాలను ఆదుకున్నామని అన్నారు. మనబడిని అందరూ ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు మాస్టర్, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, జగదీష్‌లు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న మహిళా సంఘ నాయకులు

వాణికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి- పలాస

ప్రేమికురాలు వాణిపై దాడి చేసి గాయపరిచిన వారిని శిక్షించాలని పిఒడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ఉత్తరాంధ్ర మహిళా సంఘాల జిల్లా కార్యదర్శి పి.నాగమణి డిమాండ్ చేశారు. పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వాణిని మంగళవారం పరామర్శించారు. మండలంలోని గురుదాసుపురానికి చెందిన ఎస్.ప్రశాంత్ వాణిని ప్రేమించారని చెబుతూ మోసగించారని అన్నారు. ఆమె పంచాయతీ పెద్దలను ఆశ్రయించిందని పేర్కొన్నారు. ఐదు పంచాయతీల పెద్దల సమక్షంలో దండలు మార్చుకొని వివాహం చేసుకున్నారన్నారని తెలిపారు. ఇదిలా ఉండగా ప్రశాంత్ వేరే పెళ్లికి యత్నించడంతో వాణి న్యాయ పోరాటానికి దిగిందని, ప్రశాంత్ కుటుంబ సభ్యులు దాడి చేశారని అన్నారు. వాణికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. పరామర్శించిన వారిలో బర్ల జానకి, గొరకల బాలకృష్ణ, బర్ల గోపి, పోలారావు ఉన్నారు. ఈ విషయంపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎఎస్‌ఐ సంజీవరావు తెలిపారు.

కళాను సన్మానిస్తున్న 'ఎన్ఇఆర్'

'కళా'ను కలిసిన ఎన్ఇఆర్

ప్రజాశక్తి- రణస్థలం

రాజాం క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావును ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్‌డిఎ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు దుశ్శాలువ కప్పి జ్ఞాపికను అందజేశారు. నియోజకవర్గ రాజకీయాలపై ఇరువురు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై కళా ఎన్ఇఆర్‌కి సూచనలు చేశారు. ఆయనతోపాటు లావేరు మండల పార్టీ అధ్యక్షులు ముప్పిడి సురేష్, జి.సిగడాం మండల పార్టీ అధ్యక్షులు కుమరాపు రవికుమార్, కొష్ట మాజీ సర్పంచ్ పిసిని జగన్నాథం నాయుడు, రణస్థలం జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గొర్లె లక్ష్మణరావు, లావేరు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పిన్నింటి మధుబాబు, ఎంపిటిసి మాజీ సభ్యులు లంక నారాయణరావు, వేల్పురాయి సర్పంచ్ బాలి శ్రీనివాసరావు, బుడతవలస మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, కోటపాలెం మాజీ సర్పంచ్ ధనుంజయ, సిహెచ్‌సి మాజీ చైర్మన్ వెలిచేటి సురేష్‌కుమార్ ఉన్నారు.

రేపు వాసుదేవరావు వర్ధంతి

ప్రజాశక్తి- పలాస

వజ్రపుకొత్తూరు మండలం రిట్టపాడులో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర మాజీ కమిటీ సభ్యులు, రాష్ట్ర మాజీ కార్యదర్శి పైల వాసుదేవరావు వర్ధంతి వేడుకలు ఈ నెల 11న నిర్వహిస్తున్నామని అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కార్యదర్శి కె.సోమేశ్వరరావు తెలిపారు. మండలంలోని కొటారింగ్‌తాళభద్ర సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన మంగళవారం ప్రచారం నిర్వహించారు. వర్ధంతి వేడుకలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ విముక్తి కోసం శ్రీకాకుళ సాయిధ గిరిజన రైతాంగ పోరాటం చేశారని అన్నారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, పాపారావు, భువన, సుబ్బారావు, చిన్నారావు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రారంభిస్తున్న ఎంపిటిసి గోపి

చలివేంద్రాలు ప్రారంభం

టెక్కలి రూరల్: టెక్కలి నియోజకవర్గం బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యాన బిఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. తొలి రోజు వెయ్యి మందికి పైగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపి బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సెక్రటరీ వడుగూరి రాజేష్, టెక్కలి నియోజకవర్గం సభ్యులు గన్నవరపు శ్రీనివాసరావు, సీతాపతి, వెంకటరమణ, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని మండపల్లి, తోటూరు గ్రామాల్లో పాదచారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించామని ఎంపిటిసి కాళ్ల గోపి అన్నారు. తన తల్లి కాళ్ల సీతమ్మ జ్ఞాపకార్థంతో చదివేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో కరాగాని కృష్ణ, గరిగిపాటి చరణ్, పత్తిర్ల గిరిబాబు, ఎం. రాంబాబు, బత్తుల రమేష్, కరాటే ప్రసాద్, కృష్ణచంద్ర సాహు, జి.బాబూరావు పాల్గొన్నారు. రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ ఎం.రాంబాబు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని పాతమున్సిపల్ కార్యాలయం వద్ద సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు డాక్టర్ పి.తాతయ్యలు, అన్నెపు సత్యం పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

కవిటి : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. సోంపేట మండలం తాళ్లబద్ర పంచాయతీ రాణిగాంకు చెందిన వార్డు మెంబరు కె.రాంప్రసాద్ తన అనుచరులతో కలిసి మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా అశోక్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా టిడిపికి అనూహ్య ఆదరణ లభిస్తోందని, రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సూరడ చంద్రమోహన్, భిన్నల జగన్నాథం పాల్గొన్నారు.

పలాస: పలాస టిడిపి కార్యాలయంలో టిడిపి ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ సమక్షంలో మందస మండలం సరియాపల్లి, జిల్లాండ, గ్రామాల నుంచి 30 కుటుంబాలు, వజ్రపుకొత్తూరు మండలం బెండి నుంచి 20 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వారికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కె.మోహనరావు, సింహాచలం, హనుమంతు వెంకటరావుదొర, తట్ట శ్రీనివాసరావు, ఎస్.సింహాచలం, పురుషోత్తం, తిరుపతిరావు, బలరాం, రాజేష్, షణుముఖ, నీలాచలం, చంద్రశేఖర్, దుర్యోధన, హనుమంతు శ్రీనివాసుదొర, ధనుంజయ, మోహనరావు తదితరులు ఉన్నారు.

పలాస : టిడిపిలో చేరిన వారితో గౌతు శిరీష

చంద్రబాబుకు వికలాంగుల కృతజ్ఞతలు

నరసన్నపేట : వికలాంగులు పడుతున్న కష్టాలను దృష్టిలో పెట్టుకొని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.6 వేలు పింఛను పెంపుపై హామీనిచ్చారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా నందమూరి తారక రామారావు, కింజరాపు ఎర్రంనాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో రూ.500 ఉన్న పింఛను రూ.2 వేలుకు పెంచిన పెంచారని, మళ్లీ ఎన్‌డిఎ ఉమ్మడి కూటమి ప్రభుత్వ ఏర్పాటైతే రూ.6 వేలు చేస్తామని హామీనివ్వడం గొప్ప విషయమన్నారు. అనంతరం వికలాంగులు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వికలాంగుల రాష్ట్ర కమిటీ సెక్రటరీ ఊర్ణ సాయికుమార్, జిల్లా అధ్యక్షులు గురుబిల్లి రమణమూర్తి, నియోజకవర్గ అధ్యక్షులు ఇట్రాజు హరి, బొచ్చ జయరాం, కేశవరావు, నరసింహ మూర్తి, దమయంతి, ప్రమీల పాల్గొన్నారు.

రమణమూర్తికి కృతజ్ఞతలు తెలుపుతున్న వికలాంగులు

నిర్మానుష్యంగా పట్టణం

ప్రజాశక్తి- ఆమదాలవలస

కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఎండ వేడిమికి ప్రజలు అల్లాడిపోతున్నారు. రోజురోజుకూ మారుతున్న ఉష్ణోగ్రతలు మంగళవారం మరింత ఎక్కువగా పెరగడంతో ఎండ తీవ్రతకు ప్రజలు వేసవి తాపాన్ని తట్టుకోలేక ఇంటికే పరిమితమయ్యారు. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించింది. నిత్యం రద్దీగా ఉండే పట్టణ ప్రధాన రహదారి ఉదయం 10 గంటల నుంచే జనాలు లేక బోసిపోయింది. మంగళవారం ఉగాది సందర్భంగా ప్రజలు మార్కెట్లకు వచ్చి సందడి చేస్తారనుకుంటే... ఎండ తీవ్రత వలన ఎవరు బయటకు రాలేకపోయారు. ఏటా ఉగాది పండగ సందర్భంగా గ్రామీణ ప్రాంత ప్రజలు కొత్త తెలుగు సంవత్సరలో వివిధ సామగ్రి ప్రథమంగా కొనుగోలు చేయాలని పట్టణానికి రావడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది ఎండ తీవ్రత దెబ్బకు గ్రామీణ ప్రాంత ప్రజలూ సెంటిమెంట్‌ను పక్కనపెట్టి ఇంటికే పరిమితమయ్యారని పలువురు వర్తకులు తెలిపారు. దీంతో పాటు పట్నంలోని నిత్యం రద్దీగా ఉండే వైఎస్ఆర్ కూడలి, వన్‌వే కూడలి, మార్కెట్ ప్రధాన రహదారి జనసంచారం లేక నిర్మానుస్యంగా మారి బోసిపోయింది.

నిర్మానుష్యంగా ఉన్న వైఎస్ఆర్ కూడలి

దుస్తుల పంపిణీ

శ్రీకాకుళం: నగరంలోని సూర్యమహల్ కూడలిలో ఉన్న జామియా మసీదులో పేద ముస్లిములకు ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అదినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు మంగళవారం దుస్తులు, నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. ముందుగా మసీదు ఇమాములు ప్రార్థనలు చేశారు. అనంతరం శ్రీనివాసరావు, జాఫర్‌లు మాట్లాడుతూ రంజాన్ నెలలో ఇలా దానం చేస్తే నిరుపేదలు పండుగ పూట సంతోషంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు మహిబుల్లాఖాన్, ఉపాధ్యక్షులు హజీ సర్ఫరాజ్, అబ్దుల్ భాషా, సుకూర్ ఖాన్, జానీ, ముజీబ్, సలీమ్‌ఖాన్, సాధిఖుల్లా, అమీరుల్లా బేగ్, భాషా, షేక్ రఫీక్, జిలానీ, అమీర్ పాల్గొన్నారు.

దుస్తులను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

సంక్షిప్త వార్తలు

గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులుగా గోపాలరావు

గోపాలరావు

శ్రీకాకుళం అర్బన్ : గిరిజన ఐక్యవేదిక జిల్లా ఇన్‌ఛార్జి అధ్యక్షులుగా బరండి గోపాలరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన పాతపట్నం మండల గిరిజన సంఘం అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. జిల్లా గిరిజన ఐక్యవేదిక అధ్యక్షులుగా పనిచేసిన దివ్వల లక్ష్మీనారాయణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జిగా నియమిస్తూ రాష్ట్ర సంఘం నుంచి ఆదేశాలు వచ్చాయని గోపాలరావు తెలిపారు.

గోవిందరావు గెలుపునకు కృషి

కొత్తూరు : టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు గెలుపునకు కృషి చేస్తామని మండల టిడిపి నాయకులు అగతముడి మాధవరావు, వి.సుధాకర్, మతల గాంధీ, వై.దాసునాయుడు, జి.కమలాకర్ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాల యంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పాతపట్నంలో టిడిపి జెండా ఎగురవేసి చంద్రబాబుకు బహుమతిగా ఇస్తామన్నారు. పదేళ్లుగా గోవిందరావు చేసిన సేవకు ప్రజల నుంచి స్పందన వస్తుందని అన్నారు.

'బిసివై' అభ్యర్థిగా శ్రీనివాసరావు

బూర్జ : ఆమదాలవలస నియోజకవర్గ భారత చైతన్య యువసేన పార్టీ (బిసివై) పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎస్.శ్రీనివాసరావును ప్రకటించారు. మండలంలోని తోటవాడకు చెందిన వ్యక్తి. బిసివై తరుపున పోటీ చేసేందుకు టిక్కెట్ ఇవ్వడం ఆనందం వ్యక్తంచేశారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్‌కు అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

నందిగాం : 1997-98లో పదవ తరగతి నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న బులక మల్లేశ్వరరావు గతంలో అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి భార్య గీతకు మల్లేశ్వరరావుతో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు రూ.50 వేలు ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో అట్టాడ రాంబాబు, మట్ట ఉమాపతి, నారాయణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : కవులను సన్మానిస్తున్న జోహార్‌ఖాన్

ఘనంగా ఉగాది వేడుకలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సాహిత్య సంస్కృతి సమైక్య, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం టెక్కలి ఆధ్వర్యాన ఉగాది వేడుకలు మంగళవారం నిర్వహించారు. సోషల్ సంక్షేమ వసతిగృహాల అధికారి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన దివ్వల ప్రసాదరావు దంపతులను సన్మానించారు. అలాగే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు 14 మందికి సన్మానించారు. ముందుగా కవితలు, సంస్కృతి కార్యక్రమాలు పంచాంగ పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు జీరు వెంకటరెడ్డి మాస్టర్, కార్యదర్శి బొడ్డ అయ్యాబాబు, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రోణంకి రామచందర్రావు, ఉపాధ్యాయులు మూల తాతయ్య, అనిశెట్టి చిట్టెన్న, ధనుంజయరావు, నాగభూషణంరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక జ్ఞానభారతి విద్యా సంస్థల్లో ఉగాది వేడుకల్లో భాగంగా పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించారు. జ్ఞానభారతి ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వహణాధికారి జోహార్ ఖాన్ అధ్యక్షత వహించారు. ముందుగా పాఠశాల పరిపాలన అధికారి ప్రేమ్ సర్తాస్ ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కవులను జోహార్ ఖాన్ దుశ్శాలువలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆర్.రాంప్రసాద్, ప్రిన్సిపాల్ ఇందు భూషణ్‌పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అలీమ్ ఖాన్ పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని రాపాకలో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పండగను పురస్కరించుకొని క్షానపులి వెంకటరమణమూర్తి శర్మ పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, ఎంపిటిసిల ప్రతినిధులు వండాన వెంకటరావు, కోట నాగరాజు, పిఎసిఎస్ చైర్మన్ కొంచాడ రమణమూర్తి, గ్రామ పెద్దలు వండన అప్పన్న, పోతురాజు సూర్యారావు, బలగ శంకర్‌భాస్కరరావు, కండాపు శ్రీనివాసరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యాన శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇప్పిలి నరసయ్య శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఆలయ పాలకమండలి శాశ్వత చైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావును సన్మానించారు. ఆయనతో పాటు ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, అర్చకులు ఇప్పిలి కాశ్యపశర్మ, ఫణీంద్రశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మలను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి ఎన్.నారాయణరావు పాల్గొని సన్మాన గ్రహీతలను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ సహాయకులు చక్రవర్తి పాల్గొన్నారు.

పొందూరు : పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు

ఆమదాలవలస : మాట్లాడుతున్న నరేంద్ర

ఆమదాలవలస : పట్టణంలోని భవిత హైస్కూల్‌లో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను నిర్వహించారు. ఉగాది గొప్పతనాన్ని చాటి చెబుతూ చిన్నారులు ఉగాది ప్రత్యేక పాటలు, జానపద గీతాలకు నృత్యాలు చేశారు. పల్లె గీతాలకు చిన్నారులు చేసిన నృత్యాలు ఆద్యాంతం అల్లరించాయి. పాశ్చాత్య పోకడలకు అలవాటు పడిన నేటితరం మన సాంప్రదాయాలను విస్మరిస్తున్నారని పాఠశాల కరస్పాండెంట్ సువ్వారి మురళీధరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జె.నరేంద్ర, డైరెక్టర్ సువ్వారి సునీత పాల్గొన్నారు.